విశాలాంధ్ర అనకాపల్లి
పేజి నెం. 6
బుధవారం 14, ఆగస్టు, 2024

వైసీపీ సూపర్ కౌన్సిలర్ అండదండలతో

ప్రభుత్వ భూమి కబ్జా

పట్టించుకోని మున్సిపాలిటీ అధికారులు

విశాలాంధ్ర - యలమంచిలి: యలమంచిలి పట్టణంలో ప్రభుత్వ భూములను కొందరు సులువుగా కబ్జా చేస్తున్నారు. వైసీపీ సూపర్ కౌన్సిలర్ అండదండలతో ప్రభుత్వ భూమిని విచ్చలవిడిగా కబ్జా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పట్టణంలో ఏఎస్ఆర్ కాలనీ వద్ద ప్రభుత్వ స్థలంలో బడ్డీ ఏర్పాటు చేసి కొన్ని నెలల తర్వాత శాశ్వత కట్టడాన్ని నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. నాయకుల అండదండతో చిన్న షాపు ఏర్పాటు చేసి అనంతరం శాశ్వత కట్టడం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అప్పటి మాజీ ఎమ్మెల్యే యువి రమణమూర్తి రాజుకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో వెంటనే తొలగించాలని మున్సిపల్ అధికారులను అప్పుడే ఆదేశించారు. కానీ మున్సిపల్ అధికారులు నేటికీ తొలగించకపోవడంతో ఎక్కడ ఆ భూమి కబ్జాకు గురవుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విలువైన ప్రభుత్వ స్థలం కబ్జాకు గురి కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

20న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 20న జరగబోవు జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా అనకాపల్లి జిల్లాలో గల 1 నుండి 19 సంవత్సరం గల బాల బాలికలకు అంగన్వాడీ, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలో చదివే విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అన్ని విద్యా సంస్థల్లో, అంగన్వాడీ కేంద్రాలలో ఉచితంగా ఇవ్వడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ విజయక్రిష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మాత్రలు 1 సంవత్సరం నుండి 2 సంవత్సరములు వయసు గల పిల్లలకు సగము మాత్రను నీటిలో కరిగించి త్రాగించాలని, 2 నుండి 3 సంవత్సరములు వయసు గల పిల్లలకు పూర్తి మాత్రను నీటిలో కరిగించి త్రాగించాలని, 3 సంవత్సరముల నుండి 19 సంవత్సరము వయసు గల వారికి పూర్తి మాత్రను చప్పరించేటట్లు చూడాలని అన్నారు. మధ్యాహ్నం భోజనం చేసిన అర గంట తరవాత మాత్రలను వేసుకోవాలన్నారు. ఈ మేరకు జిల్లా యంత్రగం అన్ని ఏర్పాట్లు చేస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం గోడపత్రికను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. 20న మాత్రను తీసుకొనని వారు తదుపరి 28న మాప్ అప్ రౌండ్ కార్యక్రమంలో తప్పక వేసుకోవాలని తెలిపారు. అర్హులైన వారు అందరూ విధిగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

అమరావతి నిర్మాణానికి విరాళం

విశాలాంధ్ర - యస్.రాయవరం: అమరావతి రాజధాని నిర్మాణానికి చిల్డ్రన్స్ ఫిలిం వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున 30 వేల రూపాయలు చెక్కును రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితకి అందజేశారు. రాజధాని నిర్మాణానికి తమ వంతు సహాయంగా ఈ ఫండ్‌ను ఇవ్వడం జరుగుతుందని వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ యు.వి.సంతోష్ తెలిపారు. అలాగే అనాధ పిల్లల ఆశ్రమాలకు దుప్పట్లు కూడా ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ చలమల వెంకటేశ్వరావు, సొసైటీ సభ్యులు తాకాశి కిషోర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సహజ వాయువులు, చమురు ఉత్పత్తులపై

రాష్ట్రానికి 50 శాతం వాటా ఇవ్వాలి

అఖిలపక్ష పార్టీలు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిధిలో తూర్పుగోదావరి-కృష్ణాజిల్లా తీర ప్రాంతాలలో వెలికి తీస్తున్న సహజ వాయువు, చమురు ఉత్పత్తులపై పన్ను విధించే అధికారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఉండాలని, వచ్చే ఆదాయంలో 50 శాతం ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించాలని కోరుతూ మంగళవారం సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ లిబరేషన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు అనకాపల్లిలో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక శ్రామిక సదన్ నుండి చోడవరం బస్ స్టాప్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని తమ డిమాండ్లపై ఆందోళన నిర్వహించారు. ఈ సంద ర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ కాకినాడకు 30 కిలోమీటర్ల దూరాన సముద్ర గర్భం నుండి 2024, జనవరి 7న ముడి చమురు ఉత్పత్తి ప్రారంభమైందని, కృష్ణ గోదావరి బేసిన్‌లో గ్యాస్‌తోపాటుగా చమురు విలువలు కొన్ని లక్షల కోట్లకు మించి ఉంటుందన్నారు. ఈ సహజ వనరులను దేశ సంక్షేమానికి ఉపయోగించడానికి ఎలాంటి అభ్యంతరం లేదని కాకపోతే ఆ వనరులు ఉన్న ప్రాంతానికి న్యాయబద్ధంగా రావలసిన వాటా ఇవ్వవలసి ఉందని ఆయన అన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు బి.శంకర్రావు మాట్లాడుతూ సహజంగా లభిస్తున్న గ్యాస్‌ను కొట్టేయటమే కాకుండా పెట్రోల్‌పైనా దృష్టి సారించారని, కేజీ బేసిన్‌లో చమురు ఉత్పత్తి ప్రారంభం కాగానే కేంద్ర ప్రభుత్వ అధినేత మోడీ, ఉత్తర భారత దేశ ఎలక్ట్రానిక్ మీడియా, ప్రింట్ మీడియాలో విపరీతంగా ప్రచారాన్ని చేసుకున్నారని, కానీ ఆ సహజ వనరు బయటపడిన ఆంధ్ర ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడలేదని ఆయన గుర్తు చేశారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐ.ఆర్.గంగాధర్ మాట్లాడుతూ దేశంలో, ఏ రాష్ట్రంలో సహజ వనరులు బయటపడినా దానిని మోడీ, అమిత్ షా జోడి, ఆదాని అంబానీ అనే జోడీలకు అప్పగిస్తుంది అన్నారు. దేశాన్ని ఇద్దరు గుజరాతీలు అమ్ముతూ ఉంటే మరో ఇద్దరు గుజరాతీలు కొనుగోలు చేస్తున్నారని రాహుల్ గాంధీ చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రానికి రావలసిన హక్కులు, న్యాయమైన ఆర్థిక నిధుల కోసం భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ వామపక్ష పార్టీలతో కలిసి ఉద్యమాలలో పాల్గొంటుందని అన్నారు. సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సవరాలు గణేష్ మాట్లాడుతూ ప్రజలు కట్టిన పన్నులతో కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీ ఓఎన్జీసీ నడుస్తుందని, వారు కొట్లాది రూపాయల వ్యయంతో పరిశోధన చేసి సహజవాయువు, చమురు ఎక్కడ ఉందో తెలుసుకునేసరికి, అక్కడ అంబానీ రిలయన్స్ కంపెనీ గెద్దలా దిగుతుందని అన్నారు. ఈ వ్యాపారాల ద్వారా వచ్చే కోట్లాది రూపాయల లాభాల నుండే మొన్న తన కుమారుడికి 5000 కోట్ల రూపాయలు ఖర్చుతో వివాహం జరిపించాడని, అది జరిగిన 15 రోజులకే రిలయన్స్ కంపెనీలో పని చేస్తున్న వందలాదిమందిని బర్తరఫ్ చేశాడని ఆయన గుర్తు చేశారు.

ప్రపంచంలో ఏ ప్రాంతంలోనైనా సహజ వనరులను ఉపయోగించుకునే హక్కు ఆ ప్రాంత ప్రజలకు ఉంటుందనేది సహజ న్యాయ సూత్రల ప్రకారం, సహజ వనరులు ఏ రాష్ట్రంలో ఉంటే ఆ రాష్ట్రానికి ఉత్పత్తిలో 50 శాతం కేటాయించాలని 12వ ఫైనాన్స్ కమిషన్ కూడా చెప్పిందని, మన అవసరాలు తీర్చకుండానే 1500 కిలోమీటర్ల దూరాన వున్న గుజరాత్, మహారాష్ట్రలకు మన తీరం నుండి గ్యాస్‌ను తరలిస్తూ ఆంధ్ర ప్రజలకు అన్యాయం చేస్తున్నారని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పి. ఎస్. అజయ్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కోటేశ్వరరావు, బి.సుబ్బలక్ష్మి, బి.వరమేశ్వరీ, కొరిబిల్లి శంకరరావు, వియ్యాపు రాజు, పనేంద్ర కుమార్, బి.బాజ్జీ, నరాలశెట్టి సత్యనారాయణ, పోతురాజు, బి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

బంగారమ్మ తల్లిని దర్శించుకున్న హోం మంత్రి అనిత

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో రేవుపోలవరం గ్రామంలో ఉన్న శ్రీ బంగారమ్మ తల్లి అమ్మవారిని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత దర్శిం చుకున్నారు. ఎన్నికల ముందు తాను మొక్కిన మొక్కును ఇటీవల గెలుపొందడంతో ఆ మొక్కను తీర్చుకోవడం జరిగింది. అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి చిత్రపటం అందజేశారు. స్థానిక నాయకులు గ్రామాల్లో సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, టీడీపీ నాయకులు ఎన్.వెంకటరాజు, గుర్రం రామకృష్ణ, తుమ్మపాల నాగేశ్వరరావు, లోవరాజు, గంపల అప్పన్న, బంగారి, అడవిరాజు తదితరులు పాల్గొన్నారు.

పలు పాఠశాలలో ఆటల పోటీలు

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని పలు పాఠశాలలో విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొన్నారు. ఆగస్టు 15 స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులకు పాఠశాలలోని వివిధ క్రీడలతో పాటు వ్యాచ రచన, డిబేట్, క్విజ్, దేశభక్తి గేయాలు వంటి పోటీలను ఉపాధ్యాయులు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి ఆగస్టు 15న బహుమతులు ఇవ్వడం జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు.

75 మీటర్ల జాతీయ జెండాతో భారీ ర్యాలీ

విశాలాంధ్ర - వి.మాడుగుల: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని మాడుగులలో భారత నిర్మాణ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం మాడుగులలో 75 మీటర్లు జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. వందేమాతరం, భారత్ మాతాకీ జై అంటూ విద్యార్థులు నినాదాలు చేసుకుంటూ గ్రామం వీధులలో ఊరేగింపు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, మండల సతీష్, తవ్వా సన్యాసయ్యశెట్టి, జరుగుబిల్లి సుబ్బారావు, భారత నిర్మాణ సేవ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఛలో హైదరాబాద్‌కు తరలి వెళ్లిన ఎమ్మార్పీఎస్ నాయకులు

విశాలాంధ్ర - పాయకరావుపేట: రెండు తెలుగు రాష్ట్రాలలోని మాదిగ జాతి ప్రజలు గత 30 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న ఎస్సీ వర్గీకరణను సాధించి ఢిల్లీ నుంచి హైదరాబాద్‌లో అడుగుపెడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు ఘనంగా స్వాగతం పలికేందుకు పాయకరావుపేట నుంచి ఎమ్మా ర్పీఎస్ నాయకులు తరలి వెళ్లారు. పట్టణంలోని నర్సీపట్నం రోడ్డు జంక్షన్ నుంచి కార్లలో ఛలో హైదరాబాద్‌కు వెళ్లిన వారిలో ఎమ్మార్పీఎస్ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు యలక మల్లిబాబు, గంపల సుబ్బారావు, పాయకరావుపేట నియోజకవర్గ ఇంఛార్జి గంపల చినరాజు, కోరుబిల్లి ఈశ్వరరావు, మారేడుపూడి సతీష్, కంటిపాము డేవిడ్ రాజు, ఆరుగుల రమేష్, గంపల బాలకృష్ణ, సారిపల్లి రాజా తదితరులు ఉన్నారు.

జగన్‌ను కలిసిన వైసీపీ నేతలు

విశాలాంధ్ర - బుచ్చయ్యపేట: ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో చోడవరం నియోజకవర్గం బుచ్చయ్యపేట మండలం నుండి వైసీపీ నేతలు, ఎంపీటీసీ సభ్యులు సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలో కలిశారు. ఈ సందర్భంగా బుచ్చయ్యపేట మండల పార్టీ అధ్యక్షులు జోగా కొండబాబు, పెదపూడి గ్రామ ఎంపీటీసీ సభ్యులు గోకివాడ రాము భవాని, నియోజకవర్గ ఇన్చార్జి కరణం ధర్మశ్రీ నేతృత్వంలో వైయస్ జగన్మోహన్ రెడ్డిని కలిసి ఫోటోలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం అంకితభావంతో పని చేస్తామని పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తామని తెలిపారు.

రైతులు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర - కే.కోటపాడు: రైతు సేవా కేంద్రంలో ప్రతి రైతు వివరాలు అందజేసి ఈక్రాప్ నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ తెలిపారు. మంగళవారం గుండుపాలెం గ్రామంలో రెవెన్యూ వ్యవసాయ అధికారులు రైతుల వంట పొలాలకు వెళ్లి ఈక్రాప్ నమోదు చేశారు. ప్రతి రైతు వారికి చెందిన వ్యవసాయ భూమిలో ఏ వంట వేస్తున్నారు ఆ వంట వివరాలను ఖరీఫ్ రబీల్లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతులు ప్రభుత్వ పథకాలకు అర్హత పొందుతారని అన్నారు. పొలంలో వేసిన పంటను ఫోటో తీసి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. దీనివల్ల పంట నష్టం, క్రాప్ ఇన్సూరెన్స్, ధాన్యం సేకరణ తదితర పథకాలకు అర్హులన్నారు. ఈ పంట నమోదు సెప్టెంబర్ 15వ తేదీలోగా పూర్తి చేయవలసి ఉంటుందని, మండలంలో ఉన్న ప్రతి రైతు వారికి దగ్గర్లో ఉన్న రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకులను కలిసి పంట వివరాలు నమోదు చేయించుకోవాలని కోరారు.

రంగురాళ్లు క్వారీని సందర్శించిన ఎస్ఐ

విశాలాంధ్ర - గొలుగొండ: అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం సాలిక మల్లవరం సమీపంలో రిజ్వర్ ఫారెస్ట్‌లో అక్రమంగా రంగురాళ్ళ తవ్వకాలు జరుగుతున్నాయని సోషల్ మీడియాలో వచ్చిన వార్త అవాస్తవమని గొలుగొండ ఎస్సై కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా రంగురాళ్ల క్వారీని సందర్శించగా ఎటువంటి తవ్వకాలు రిజర్వ్ ఫారెస్ట్ కొండల్లో క్వారీలో జరగలేదని గొలుగొండ ఎస్సై బి. కృష్ణారావు, నర్సీపట్నం రేంజర్ లక్ష్మి నర్సింగరావు తెలిపారు. క్వారీని ఇరువురు సందర్శించి ఎటువంటి తవ్వకాలు కూడా ఇక్కడ లేవని నిర్ధారించడం జరిగింది. అయితే కొన్ని సోషల్ మీడియా గ్రూపుల్లో వచ్చిన వార్తలు అవాస్తవాలని ఎస్సై కృష్ణారావు, రేంజర్ లక్ష్మీ నరసింహ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది. ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్



విశాలాంధ్ర -మునగపాక: మండలంలోని వాడ్రాపల్లి పంచాయతీ గ్రామాల్లో దోమల నివారణకు తీసుకునే చర్యల్లో భాగంగా ఫాగింగ్ ఆపరేషన్ చేపట్టినట్టు గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు తెలిపారు. ఇటీవల వాతావరణంలో వచ్చిన మార్పులతో గ్రామాల్లో దోమల బెడద అధికం కావడంతో చాలామంది జ్వరాల బారిన పడ్డారు. ఈ నేపథ్యంలో కాలువలు, దుకాణ సముదాయాల వద్ద ఫాగింగ్ చేపట్టారు. వాడ్రాపల్లి గ్రామ సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు స్వయంగా తన బైక్పై గ్రామమంతా దోమల నివారణకై ఫాగింగ్ చేయించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమకాటు బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అని నూకరాజు ప్రజలకు సూచించారు.

80వ వార్డులో హర్ ఘర్ తిరంగా



విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం అనకాపల్లి జీవీఎంసీ 80వ డివిజన్‌లో కూటమి పార్టీ ఆధ్వర్యంలో ప్రతి ఇంటిపై భారతదేశం జెండా ఎగిరివేయాలని నిశ్చయిస్తూ ప్రజలందరి సమక్షంలో జండా ఎగురవేశారు. ఈ కార్యక్రమం భారతదేశం మొత్తం ఈ మూడు రోజులు ప్రతి ఇంటిపై భారత దేశ ఔన్నత్యాన్ని చూపించే విధంగా ప్రజలు దేశంపై ఉన్న అభిమానాన్ని చూపించే విధంగా ప్రతి ఇంటిపై జెండాలు కట్టే విధంగా భారతీయ జనతా పార్టీ ప్రజలతో మమేకమై ఈ కార్యక్రమం జరిపిస్తుంది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ డివిజన్ అధ్యక్షులు, భారత జనతా పార్టీ డివిజన్ అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు మారిశెట్టి భాస్కరరావు, తెలుగుదేశం డివిజన్ ఇంచార్జ్ బొడ్డేడ జోగినాయుడు, బొడ్డేడ మురళి రమణ, శ్రీనివాసు మల్లేశ్వరరావు, ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి



విశాలాంధ్ర - చోడవరం: చోడవరం లోని ఎస్సీ కాలేజీ బాయ్స్ హాస్టల్ లో వసతి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘం పి.డి.ఎస్.ఓ. ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వ వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘ నాయకులు మాట్లాడుతూ చోడవరంలోని ఎస్సీ కాలేజీ హాస్టల్ భవనాలు చాలా పాతబడి కారిపోతున్నాయన్నారు. 1980లో ఈ హాస్టల్‌ను నిర్మించడం జరిగిందని, ఉన్న రూముల్లో రెండు రూములు పూర్తిగా పాడైపోయాయని తెలిపారు. మిగతా రూమ్స్‌లో వర్షం పడితే నీటిమయంగా మారుతుందని, కిటికీలు, తలుపులు లేవన్నారు. ఈ వర్షాకాలంలో విద్యార్థులు పడుకోవడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేసారు. దోమల బెడద వలన దోమ కాటుకు గురై జ్వరాల బారిన పడుతున్నారన్నారు. శుభ్రమైన బాత్రూములు కూడా లేవన్నారు. హాస్టల్ డౌన్‌లో ఉండడం వలన చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వచ్చిన నీరు కూడా అక్కడే స్టాక్ అవుతుందన్నారు. 50 మందితో నడుస్తున్న ఈ హాస్టల్‌కు కొత్త భవనాలు నిర్మించినట్లయితే వందమందికి పైగా వెనుకబడిన విద్యార్థులు చదువుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. చోడవరం అనేది ఏజెన్సీకి ఒక ముఖద్వారం లాంటిదని, ఒక నియోజకవర్గ కేంద్రమైన చోడవరంలో హాస్టల్ పరిస్థితి ఇలా ఉంటే మిగతా రూరల్ ఏరియాల్లో హాస్టల్స్ ఎలా ఉంటాయో చెప్పనక్కర్లేదని, కావున తమరు దయుంచి ఎస్సీ కాలేజీ బాయ్స్ హాస్టల్‌కు కొత్త భవనాలు నిర్మించాలని, అలాగే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచే విధంగా కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.ఓ. (ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ) రాష్ట్ర అధ్యక్షులు ఎన్.భాస్కర్, జిల్లా కో ఆర్డినేటర్ ఎ.మౌనిక, అఖిల్, పి.రామకృష్ణ, చంటి, రామ్ చరణ్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

చిరంజీవి జన్మదిన వేడుకల గోడపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - పరవాడ: మెగాస్టార్ చిరంజీవి 69వ జన్మదిన వేడుకలను లంకెలపాలెంలో ఈ నెల 22న ఘనంగా నిర్వహించేందుకు చిరంజీవి అభిమాన సంఘం సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ మేరకు వారం రోజుల పాటు లంకెలపాలెంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆ కార్యక్రమాలకు సంబంధించిన గోడపత్రికను పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిరంజీవి అభిమాన సంఘం నాయకుడు మదక రమేష్ నాయుడు మాట్లాడుతూ ఈ జన్మదిన వేడుకలు సందర్భంగా ఈ నెల 16 నుంచి 22 వరకు వివిధ కార్యక్రమాలు చేపడతామన్నారు. చివరి రోజు 22న పంచకర్ల రమేష్ బాబు చేతుల మీదుగా లంకెలపాలెం జంక్షన్ వద్ద భారీ కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రమేష్ చెప్పారు. ఈ గోడ పత్రిక ఆవిష్కరణ కార్యక్రమంలో గొల్లవిల్లి శ్రీనివాసరావు, కె.వాసుదేవరావు, బంతికోరు గోవిందరాజు, రాఘవాపురవు, శ్రీనివాస్ కుమార్, ముమ్మని శ్రీనివాస రావు, బంతికోరు పెంటారావు, గొల్లవిల్లి నానాజీ, బొండా అచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 1 నుండి ఆసుపత్రి కార్మికులు దశలవారి ఆందోళన

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జిల్లాలో జిల్లా ఏరియా, సిహెచ్‌సి, ప్రభుత్వ ఆసుపత్రిల్లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్స్ చెదలు పురుగు నివారణ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు లేవని వెంటనే జీతాలు మంజూరు చేయాలని, కార్మికులు కనీస వేతనం అమలు చేయాలని లేకుంటే విధులు బహిష్కరణ తప్పదని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్, ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ హెచ్చరించారు. మంగళవారం అనకాపల్లి జిల్లా ఆసుపత్రిలో డిసిహెచ్ అధికారి శ్రీనివాస్‌రావుకు వినతిపత్రం కార్మికులు సమర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ ఈరోజుల్లో ఒక్క రోజు అద్దె పెండింగ్లో ఉంటే ఇల్లు ఖాళీ చేయమంటున్నారని అదేవిధంగా చాలీచాలని జీతాలతో బతుకు నడపడం చాలా కష్టంగా ఉందన్నారు. ఇటువంటి తరుణంలో మూడు నెలలుగా జీతాలు మంజూరు చేయకపోతే ఎలా బతకాలని లక్ష్మణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం జీవో ప్రకారం కనీస వేతనం 16 వేలు ఇవ్వాలని గత కొన్ని నెలలుగా కాంట్రాక్ట్‌ను, జిల్లా కలెక్టర్, జిల్లా కార్మిక శాఖ అధికారి, ప్రభుత్వ ఆసుపత్రి డిసిహెచ్, సూపరింటెండెంట్‌ను కలిసి విజ్ఞప్తి చేస్తున్నా స్పందన లేదని ఆయన పేర్కొన్నారు. ఇక తప్పని పరిస్థితుల్లో వచ్చే సెప్టెంబర్ 1 నుంచి నల్ల బ్యాడ్జి ధరించి నిరసనలు, 15 నుంచి విధులు బహిష్కరణ చేస్తామన్నారు. శానిటేషన్, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్ కార్మికులందరికీ బకాయిపడ్డ వేతనాలు చెల్లించాలని అన్నారు. పలు డిమాండ్స్‌తో డిసిహెచ్ శ్రీనివాస్‌కు సమ్మె నోటీస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వరప్రసాద్, ఎస్.సంతోష్, నూకరాజు, అడవిరాజు, వై.రాజలక్ష్మి, ఈశ్వరరావు, మర్రా లక్ష్మి, బి.దుర్గ, ఎన్.లక్ష్మి, అరుణతోపాటు నర్సీపట్నం, కోటవూట్ల, యలమంచిలి, చోడవరం, మాడుగుల, కోటపాడు, నక్కపల్లి తదితర ఆసుపత్రి కార్మికులు పాల్గొన్నారు.

స్థాపితం : 1952
విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక
విలేకరులు కావలెను
అనకాపల్లి జిల్లాలో ఈ కింది కేంద్రాల్లో పని చేయుటకు కనీస విద్యార్హత ఇంటర్, ఆపైన చదివి జర్నలిజం పట్ల ఆసక్తి కలిగి తెలుగు భాషలో స్పష్టంగా రాయడం, చదవడం వచ్చి ఉండాలి.
తేది: 18-8-2024వ తేదీన ఉదయం 10 నుంచి 11 గంటల వరకు అనకాపల్లి విశాలాంధ్ర కార్యాలయంలో అర్హత రాత పరీక్ష నిర్వహించబడును. ఆసక్తి ఉన్న వారు 18వ తేదీ ఉదయం 9.30 గంటల్లోగా వాట్సాప్‌లో గాని నేరుగా గాని తమ పేర్లు నమోదు చేసుకోగలరు. అదేరోజు మధ్యాహ్నం 2 గం.ల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించబడును.
ఖాళీలు: అనకాపల్లి టౌన్, అనకాపల్లి కలెక్టరేట్, చోడవరం రూరల్, రోలుగుంట, బుచ్చయ్యపేట, నర్సీపట్నం రూరల్, నాతవరం, సబ్బవరం కేంద్రాల్లో పని చేయాలి.
సంప్రదించాల్సిన చిరునామా:
కొండలరావు, విశాలాంధ్ర బ్యూరో చీఫ్
విశాలాంధ్ర కార్యాలయం, దుర్గా లాడ్జి వీధి, నర్సింగరావుపేట, రామచంద్ర థియేటర్ వెనుక, అనకాపల్లి.
సెల్: 9291900805, 9573385159.

సమస్యల గుర్తింపు పరిష్కార, దిశగా వార్డు పర్యటన

80వ వార్డు అధ్యక్షులు బొడ్డేడ జోగినాయుడు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: స్థానిక సమస్యలు గుర్తింపు, వార్డు పరిష్కారం కోసమే వార్డు పర్యటన చేస్తున్నట్లు 80వ వార్డ్ అధ్యక్షులు బొడ్డేడ జోగినాయుడు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో మంగళవారం జివిఎంసి 80వ వార్డు కూటమి నాయకులు పాత మునిసిపల్ 22వ వార్డు వేలం వీధి, విల్లూరి అక్కయ్య నాయుడు వీధి, కాంచెట్టు ప్రాంతాలలో పర్యటించి స్థానిక సమస్యలు కూటమి నాయకులు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన సమస్యగా చినరామస్వామి కోవెల నుండి కాంచెట్టుకు వెళ్లే కల్వర్టు పూర్తిగా పాడైందని, రోడ్డు కూడా బాగా అయిపోవడం వల్ల వర్షం వచ్చినప్పుడు వరుసవనీరు రోడ్డుమీద ప్రవహిస్తున్నదని మా వీధికి కల్వర్టు రోడ్లు వేయించవలసిందిగా జోగి నాయుడుని అక్కడ ప్రజలు కోరారు. వేలం వీధిలో వీధి దీపాములు,చేతి బోరు, కాలువల సమస్యను అక్కడ ప్రజలు జోగినాయుడు కి వివరించారు. జోగి నాయుడు మాట్లాడుతూ మొన్న జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో ఇంటింటా ప్రచారం కార్యక్రమంలో ఎన్నికలలో ఇచ్చిన హామీ బాబు సూపర్ సిక్స్ లో వచ్చే సంక్షేమ పథకాలన్నీ ప్రజలకు వివరించి మీకు వార్డులలో ఏ సమస్య వచ్చినా మేము ఉన్నామని వాళ్లకు భరోసా ఇచ్చి ఓట్లు వేయమని అడగడం జరిగిందని దాన్ని నమ్మిన ప్రజలు విశ్వాసంతో కూటమి అభ్యర్థులకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు 80వ వార్డు ప్రజలకు ధన్యవాదములు తెలియజేసుకుంటున్నామని ఇచ్చిన మాట ప్రకారం వార్డులలో ప్రధాన సమస్యలు తెలుసుకుని శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, ఎంపీ సీఎం రమేష్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పీలా గోవింద సత్యనారాయణ, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వర్ రావు, దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కారం అయ్యేలా చేసే బాధ్యత మా కూటమి నాయకులుదని చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఎన్నికల ముందు ఇచ్చిన బాబు సూపర్ సిక్స్ సంక్షేమ పథకంలో భాగంగా ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా అన్న క్యాంటీన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం పథకాలు ఆరోజు ప్రారంభమవుతున్నాయని త్వరలోనే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు నమోదు కార్యక్రమం జరుగుతుందని వార్డు ప్రజలకు జోగినాయుడు వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి అధ్యక్షులు మారిశెట్టి భాస్కరరావు, పాత మున్సిపల్ వార్డు అధ్యక్షులు విల్లూరి రమణబాబు, బొడ్డేడ మురళి, బుద్ధ శ్రీనివాసరావు, కర్రి మల్లేశ్వరరావు, కాండ్రేగుల రాజు, బొడ్డేడ శ్రీనివాసరావు, దూలం ప్రసాద్, బుద్ధ ఈశ్వరరావు, పెంటకోట చందర్రావు, బివిఎస్ అప్పారావు, పెంటకోట మధు, బుద్ధ విశ్వనాథ్, బొడ్డేడ నూకరాజు, మళ్ళ గణేష్, రాపేటి సంతోష్, బుద్ధ లక్ష్మి అప్పారావు, సూరిశెట్టి బల్లమ్మ, విల్లూరి సత్తిబాబు, వేలం ప్రసాద్ పాల్గొన్నారు.

జోగి రమేష్ అరాచకాలు దారుణం

టీడీడీ దేత బుద్ధ నాగ జగదీశ్వరరావు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: అగ్రిగోల్డ్ బాధితులు పక్షాన నిలబడతామని 2019 ఎన్నికలకు ముందు జగన్ రెడ్డి ఊరువాడ తిరిగి ఎన్నికల ప్రచారంలో చెప్పిన వైసీపీ నేతలు అధికారంలోకి రాగానే అధికారాన్ని అడ్డం పెట్టుకొని జోగి రమేష్ కుటుంబ సభ్యులు చేసిన అక్రమాలు పుట్టలో నుంచి పాములు వచ్చినట్లుగా ఒక్కొక్కటి బయటికి వస్తున్నాయని మాజీ శాసనమండలి సభ్యులు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు ఘాటుగా విమర్శించారు. టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఉండవల్లి ఇంటిపై జోగి రమేష్ రౌడీలను వెంటబెట్టుకుని నానా యాగి చేసి జగన్ రెడ్డి మెప్పు పొంది మంత్రి పదవి పొందారన్నారు. అధికారాన్ని మంత్రి పదవిని దుర్వినియోగం చేసి అగ్రిగోల్డ్ భూములు సిఐడి అటాచ్‌లో ఉన్న వాటిని సర్వే నెంబర్ 88లో 2160 గజాల భూమిని జోగి రమేష్ కుమారుడు జోగి రాజు బాబాయి జోగి వెంకటేశ్వరరావు పేర్ల మీద కొనుగోలు చేశారని నాగ జగదీష్ అన్నారు. వాస్తవానికి కొనుగోలు చేసిన భూముల రికార్డులు తారుమారు చేసి సర్వే నెంబరు 87లోకి మార్చివేసి 10 కోట్లకి అమ్మేశారని, దీనిపై అగ్రిగోల్డ్ భూములు అన్యాక్రాంతంపై అగ్రిగోల్డ్ యాజమాన్యం ఫిర్యాదుపై పోలీసు అధికారులు సుదీర్ఘ విచారణ చేసిన తర్వాత జోగి రాజుపై చర్యలు తీసుకోవడం జరిగిందని, దీనికి జోగి రమేష్ గగ్గోలు పెడుతూ నా కుటుంబంపై అన్యాయంగా కక్ష సాధింపు చర్యలు జరుగుతున్నాయని, గౌడ కుటుంబం నుంచి రాజకీయంగా ఎదుగుతున్నందుకు చంద్రబాబు ప్రభుత్వం నాపై కక్ష సాధిస్తున్నారని జోగి రమేష్ మొసలి కన్నీరు కారుస్తున్నారని నాగ జగదీశ్ ఎద్దేవా చేశారు. ఈ భూమి సర్వేనెంబర్ మార్పు జరిగిన తర్వాత 2023లో పరిగిపాటి సుబ్బారావు కుటుంబ సభ్యులకు జోగి రమేష్ వారి బాబాయి వెంకటేశ్వరరావు విక్రయించడం జరిగిందని, ఈ సర్వే నెంబరు మార్పు విషయంలో ఆనాటి మంత్రిగా జోగి రమేష్ అధికార దుర్వినియోగానికి పాల్పడి అడుగు అడుగున రెవెన్యూ సిబ్బందికి రిజిస్ట్రేషన్ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి అగ్రిగోల్డ్ భూములను దోచుకున్నారని, సిఐడి అధికారులు పక్కా విచారణ చేసి ప్రాథమిక ఆధారాలు సేకరించిన తర్వాతే ఏసీబీ అధికారులు జోగి రమేష్ ఇంటిపై దాడి చేశారని, అగ్రిగోల్డ్ సంస్థ ఫిర్యాదుపై జోగు రాజును అదుపులో తీసుకోవడం జరిగిందని, దీనికి జోగి రమేష్ రాజకీయ రంగు పులిమి తనకు అన్యాయం జరిగిపోతున్నట్టు మీడియా ముందు కులప్రస్థానం తీసుకురావడం బాధాకరమని, అధికారాన్ని అడ్డం పెట్టుకొని బాధితులకు న్యాయం చేస్తామని అధికారంలోకి వచ్చి వారు భూములను దోచుకోవడం అన్యాయమని నాగ జగదీష్ అన్నారు.

పేదలకు వైద్యాన్ని దూరం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన వైద్య ఆరోగ్య శాఖ సమీక్ష సమావేశంలో ప్రభుత్వ ఆసుపత్రులన్ని ప్రైవేట్ భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తామని తెలియజేశారని, దీనికి ముద్దుగా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) అని పేరు పెట్టారని, ప్రతి నియోజకవర్గంలో ఆసుపత్రుల నిర్మాణం చేస్తామని హితబోదించారని, ఇప్పటికే ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆసుపత్రులను సక్రమంగా నడపకలేకపోతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు అందుబాటులో లేక రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఇటీవల కాలంలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు వస్తే రక్తపరీక్షలు చేయడానికి పరీక్ష కిట్లు లేని స్థితి వుందన్నారు. జ్వరాలతో పిల్లల దగ్గర నుండి పెద్దల వరకు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వీటిని మెరుగుపర్చాల్సింది పోయి ప్రైవేట్ వారికి అప్పగిస్తామని చెప్పడం ఎంత వరకు సమంజసం అన్నారు. ఈ విధానం కాని అమలైతే పేదలు ఉచిత వైద్యంకు దూరమై వ్యయ ప్రయాసలకు గురై అనేక ఇబ్బందులు పడతారన్నారు. వైద్యానికి కేటాయించాల్సిన బడ్జెట్‌ను కేటాయించకుండా టెలి మెడిషన్ పేరుతో వరల్డ్ బ్యాంకు నుండి 2300 కోట్లు నిధులు తెస్తామని, కార్పొరేట్ స్థాయిలో సేవలందిస్తామని ప్రకటించారని, పంచాయితీలకు నిధులు కేటాయించక పోవడంతో గ్రామాల్లో బ్లీచింగ్, దోమల నివారణకు పాగింగ్ వంటి ప్రాథమిక చర్యలు కూడా చేయలేకపోతున్నారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఈ పరిస్థితి మరి అధ్వాన్నంగా వుందని, ఏజెన్సీలో ఎవరు అనారోగ్యంకు గురైన వారిని డోలీ మోతలతోనే ఆసుప్రతులకు తరలిస్తున్నారని, నేటికీ ఏజెన్సీ ప్రాంతంలో వందల కొలది గ్రామాలకు రోడ్డు కన్టవిటీలేవన్నారు. దీనినితో పీడర్ అంబులెన్సులు కూడా వెళ్ళలేని స్థితి వుందని, పీడర్ అంబులెన్సులకు కూడా నిబంధనల పేరుతో నిధులు కూడా సక్రమంగా ఇవ్వడంలేదన్నారు. దీనితో ఆ సేవలు కూడా అంతంత మాత్రంగానే వుంటున్నాయని, విశాఖ కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ మరణిస్తే సుదూర ప్రాంతాలకు మహాప్రస్థానం వాహనాలు ఉచితంగా దొరకడం గగనం అయిపోతుందన్నారు. క్షేత్రస్థాయి సమస్యలన్నింటిని తీసుకొని రాష్ట్ర ప్రభుత్వం వైద్యంకు కేటాయించాల్సిన నిధులు కేటాయిస్తే మెరుగైన వైద్యం ప్రజలకు అందుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న పిపిపి ఆసుపత్రులు ప్రజలకు ఏ మేరకు ఉపయోగపడతాయో పున:పరిశీలన చేయాలని కోరారు.

15న ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి విశాఖపట్నం రాజా ఆప్టికల్ కంటి ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో అనకాపల్లి ఏఎంఏఏ హైస్కూల్లో స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఆగస్టు 15న గురువారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం జరుగుతుందని రాజా ఆప్టికల్స్ కంటి ఆసుపత్రి అధినేత వూసర్ల రాజా తెలియజేశారు. ఈ కంటి వైద్య శిబిరంలో అత్యధికమైన కంప్యూటర్లపై కంటి వైద్య నిపుణులతో కంటి పరీక్షలు నిర్వహించబడతాయని తెలియజేశారు. ఈ కంటి వైద్య శిబిరంలో కంటికి సంబంధించిన అన్ని రకముల వ్యాధులకు అనగా కళ్ళు మసకగా కనబడుట, కళ్ళ నుండి నీరు కారుట, కళ్ళు ఎరుపుగా అవుట, కళ్ళు దురద పుట్టుట, దగ్గర చూపు దూరము చూపు సరిగా కనిపించకపోవడం, కంటిపై వచ్చే కండ, మెల్లకన్ను సరిచేయుట, 14 సంవత్సరముల లోపు పిల్లలకు క్యాటరాక్ట్(శుక్లం), షుగర్ వ్యాధిగ్రస్తులకు వచ్చే కంటి నరం వ్యాధులకు, కంటి గుడ్డి కి సంబంధించిన కొన్ని వ్యాధులకు, నల్లగుడ్డు మార్పిడి వంటి వ్యాధులకు ఉచితంగా పరీక్షలు శస్త్ర చికిత్సలు చేయబడునని తెలియజేశారు. అవసరమైన వారికి మందులు ఉచితముగా ఇవ్వబడును అని అన్నారు. ఆపరేషన్ అవసరమైన వారిని అదే రోజు శంకర్ ఫౌండేషన్ బస్సులో విశాఖపట్నం తీసుకుని వెళతామని తెలిపారు.కళ్ళజోడు అవసరమైన వారికి 50 శాతం తగ్గింపుతో అనకాపల్లి లో వున్న రాజా ఆప్టికల్స్ కంటి ఆస్పత్రి వారి ద్వారా ఇస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్డ్ ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు రుసుము తీసుకోకుండా అన్ని కంటి తనిఖీలు అత్యాధునికమైన పద్ధతిలో కంటి ఆపరేషన్లు నిర్వహిం చబడుతుందని పూసర్ల రాజా తెలియజేశారు. ఈ కంటి వైద్య శిబిరంలో ఆరోగ్య భద్రత ఏపీ ఈపీడీసీఎల్ , ఈసిహెచ్ఎస్ ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులకు కూడా ఉచిత కంటి తనిఖీలు చేయబడతాయని ఉద్యోగులు వారి మెడికల్ హెల్త్ కార్డు తప్పనిసరిగా తీసుకొని రావాలని తెలియజేశారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాల్సిందిగా ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - యలమంచిలి: 33/11 కెవి పురుషోత్తపురం సబ్ స్టేషన్ పరిధిలో గల 33 కెవి పురుషోత్తపురం సబ్ స్టేషన్ నుండి ధర్మవరం సబ్ స్టేషన్ 11 కెవి పురుషోత్తపురం నుండి పేరంటాలపాలెం (24 గంటలు) ఫీడర్‌కు సంబంధించి లైన్ నిర్వహణపనులు (ఆర్.డి.ఎస్.ఎస్) నిమిత్తం బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నాం 2 గంటల వరకు నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ ఈఈ కె.రాజశేఖర్ అన్నారు. 33/11 కెవి పురుషోత్తపురం సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి పిఎన్ఆర్ పేట ఫీడర్‌కు సంబంధించి లైన్ నిర్వహణ పనులు (ఆర్.డి.ఎస్.ఎస్) నిమిత్తం మధ్యాహ్నాం 2 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పురుషోత్తపురం, పులపర్తి, బయ్యవరం, పిఎన్ఆర్ పేట, మై హెరామ్ ఇండస్ట్రీస్, లక్కవరం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

అవకాశం ఉన్న చోట ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నాం 1 గంటల వరకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లకు విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందని, రైతులు గమనించి సహకరించాలని ఒక ప్రకటనలో తెలిపారు.

స్థానిక పత్రికల సమస్యల పరిష్కారానికి కృషి

సమాచార శాఖ డైరక్టర్ హిమాంసు శుక్లా

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రాంతీయ పత్రికలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ హిమాంసు శుక్లా అన్నారు. మంగళవారం విజయవాడ లోని సమాచార శాఖ డైరెక్టర్ కార్యాలయం లో పలువురు స్థానిక పత్రికల ఎడిటర్లు డైరెక్టర్ ను కలసి సంస్థల పరిష్కరించాలని కోరుతూ వ్రత పత్రాన్ని అందజేశారు ఈ సందర్భం గా వారు (ప్రెస్ అక్రిడిటేషన్స్) , చిన్న, మధ్య తరహా దిన, వార, పక్ష, మాస పత్రికలకు రెగ్యులర్ గా ప్రకటనలు విడుదల , కొత్తగా ఎంప్యానల్ మెంట్ కోసం నోటిఫికేషన్ విడుదల, ఇప్పటికే వెరిఫికేషన్ జరిగి పెండింగ్ లో ఉన్న పత్రికల ఎంప్యానల్ మెంట్ కు తగిన చర్యలు తీసుకోవాలని , 2019 కు ముందు, తర్వాత చిన్న పత్రికల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, కోరారు. వీటిపై స్పందించిన డైరెక్టర్ వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు, క్రమం తప్పకుండా వస్తున్న పత్రికలు , మ్యాగజైన్ లకు తప్పని సరిగా న్యాయం జరుగుతుందన్నారు. అవసరమైతే మరలా త్వరలో జర్నలిస్ట్ యూనియన్స్, ఎడిటర్ల అసోసియేషన్స్‌తో సమావేశం ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. డైరెక్టర్ ను కలిసిన వారిలో పలువురు పాత్రికేయ సంఘాల నాయకులు, ఎడిటర్లు వల్లూరు ప్రసాద్ కుమార్(అంతిమతీర్పు),ఎన్ కోటేశ్వరరావు (కామన్ మాన్ వాయిస్),డి నాగరాజు (పల్లె క్రాంతి), ఆర్. కోటేశ్వరరావు (వార్తా ప్రభ),జి. శివ నారాయణ (అమరావతి అపురూప),సురేష్ (మల్లెల వార్త), కె.విలియం జన్సాన్ (ఆంధ్ర వాలా),జి హరి ప్రసాద్ (ధరణి),ఈ పి.పి.కుమార్ (భారత శక్తి) ఉన్నారు.